నరసరావుపేటలో భారీ వర్షం

- జలమయమైన ప్రధాన రహదారులు
- చెరువును తలపించిన కోటప్పకొండ రోడ్డు
- లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి చేరిన వరద నీరు
- ప్రధాన రహదారి వెంట నీట మునిగిన ఇళ్లు


వర్షపు నీటితో చెరువును తలపిస్తున్న కోటప్పకొండ రోడ్డు

నరసరావుపేట రూరల్: పట్టణంలో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సాయంత్రం 5 గంటల సమయంలో ప్రారంభమైన వర్షం దాదాపు రెండు గంటల పాటు కురిసింది. భారీ వర్షంతో పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధాన రహదారులపై సైతం నీరు నిలిచిపోయింది. కోటప్పకొండ రోడ్డు ప్రాంతం చెరువును తలపించింది. ఇక్కడ మెయిన్‌రోడ్డుపై పెద్ద ఎత్తున నీరు నిలవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. 8వ వార్డు పరిధిలో లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వర్షపు నీరు వచ్చి చేరింది. డ్రెయిన్‌లు పూడిపోవడం, కొంత కాలంగా పారిశుద్ధ్యాన్ని పట్టించుకోకపోవడంతో డ్రెయిన్‌లు వ్యర్థాలపై నిండిపోయింది. భారీ వర్షానికి వచ్చిన వరద నీరు పారే దారి లేక రోడ్లను ముంచేత్తింది. దీంతో పాటు కోటప్పకొండ రోడ్డు ప్రాంతంలోని పలు గృహాల్లోకి నీరు చేరింది. ఒక్కసారిగా వచ్చిన వరద నీటితో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. ఇంటిలోని గృహోపకరణాలు నీటమునగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. వరద నీటితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా మున్సిపాలిటీ అధికారులు రాత్రి వరకు స్పందించకపోవడంతో బాధితులు మండిపడ్డారు.


కోటప్పకొండ రోడ్డులో నీట మునిగిన ఇళ్లు

డ్రెయిన్‌లు అక్రమణ– రోడ్డుపైనే నీరు

నరసరావుపేట టౌన్: వర్షం కురిస్తే పట్టణ వాసులకు ఇబ్బందులు తప్పడం లేదు. వర్షపు నీరు పారేందుకు వీలు లేకుండా సైడ్ డ్రెయిన్‌లను ఆక్రమించడంతో నీరు రోజులు తరబడి రోడ్లపై నిలుస్తుంది. ముఖ్యంగా కోటప్పకొండ రోడ్డులో ప్రధాన డ్రెయిన్ ఆక్రమించడంతో పూడిపోయింది. దీంతో వర్షం కురిసిన ప్రతిసారి నీళ్లన్ని రోడ్లపై నీలుస్తున్నాయి. మోకాళ్ల లోతు నీళ్లలో రాకపోకలు సాగించేందుకు పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెండు, మూడు రోజుల పాటు వర్షపు నీరు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతుంది. సోమవారం సాయంత్రం కురిసిన భారీ వర్షంతో కోటప్పకొండ రోడ్డు నదిని తలపించే విధంగా మారింది. పెద్ద ఎత్తున నీరు నిలిచి రాకపోకలు నిలిచిపోయాయి. సమస్య ఎన్నో నెలలుగా ఉన్న మున్సిపల్ అధికారులు స్పందించకపోవడం పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.


కోటప్పకొండ రోడ్డులో నిలిచిన నీరు


వర్షపు నీటిలో రాకపోకలు సాగిస్తున్న ద్విచక్ర వాహనదారులు


వెంగళరెడ్డినగర్‌లో భారీగా నిలిచిన వరదనీటితో చిన్నారుల కష్టాలు

లులూ మాల్‌కు ఆర్టీసీ స్థలం కేటాయించొద్దు

- ఆ.. నిర్ణయాన్ని వెనక్కు తీసుకోండి
- ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డిమాండ్


మాట్లాడుతున్న నాయకులు

నరసరావుపేట రూరల్: విజయవాడలోని ఆర్టీసీ స్థలాన్ని లులూ మాల్‌కు కేటాయిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోను రద్దు చేయాలని ఏపీ పీటీడీ (ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశం నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా నాయకులు కాసా రాంబాబు, ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎస్‌కె ఖాజా, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంకే రావు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్‌కే ఆసీఫ్ సమావేశంలో మాట్లాడారు. ఆర్టీసీ ఆస్తులను ప్రైవేటు వ్యాపారవేత్తలకు ధారదత్తం చేస్తున్న ప్రభుత్వ చర్యలను ప్రజలంతా ఖండించాలని కోరారు. లులూ మాల్‌కు ఆర్టీసీ స్థలాన్ని కేటాయిస్తూ ఇచ్చిన జీవోను వెనక్కు తీసుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆర్టీసీ ఆస్తులు కాపాడుకునేందుకు ఆర్టీసీలోని అన్ని సంఘాలు ఉద్యోమంలో భాగస్వామం కావాలని పిలుపునిచ్చారు. విజయవాడ నడిబొడ్డున గవర్నర్‌పేట–1,2 డిపోలు, పాత బస్టాండ్‌కు సంబంధించిన సుమారు రూ.400 కోట్ల విలువైన 4.15 ఎకరాల స్థలాన్ని లులూ మాల్‌కు ప్రభుత్వం కట్టబెట్టడం దుర్మార్గమని తెలిపారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు


రిజస్టరు తనిఖీ చేస్తున్న ఏడీఏ హనుమంతరావు

ఈపూరు(శావల్యాపురం): ఎరువులు బ్లాక్ మార్కెట్ కాకుండా ముందుస్తుగా అన్ని ఎరువుల దుకాణాలను తనిఖీలు చేస్తున్నట్లు డీడీఏ కార్యాలయ ఏడీఏ వి.హనుమంతరావు తెలిపారు. సోమవారం ఈపూరు మండలం ఈపూరు, కొండ్రముట్ల, ముప్పాళ్ళ గ్రామాల్లో ఎరువుల విత్తనాల దుకాణాలను వ్యవసాయ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఏడీఏ హనుమంతరావు మాట్లాడుతూ జిల్లా కలెక్టరు ఆదేశాలు మేరకు ఎరువుల విత్తనాల దుకాణాలు తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. ఎరువుల దుకాణాల్లో ఎలాంటి బయోమెక్ ప్రొడక్టు నిల్వలు లేవన్నారు.స్టాకు రిజష్టర్లు బిల్ పుస్తకాలు గోడౌన్‌ల్లో ఉన్ననటువంటి స్టాకును పరిశీలించారు.ఓఫామ్ ఉండి లైసెన్సులో ఇంక్యూషన్ చేసుకోనందున 9 టన్నుల ఎరువులను అమ్మకాలు నిలుపుదల చేసినట్లు తెలిపారు. మండల అధికారి రామారావు తదితరులు ఉన్నారు.

రేషన్ దుకాణాలపై వరుసదాడులు

బొల్లాపలి: రేషన్ షాపులపై రెవెన్యూ అధికారులు వరుసదాడులు చేస్తున్నారు. చేపట్టారు. తాజాగా సోమవారం మండలంలోని పేరూరుపాడు, వెల్లటూరు, గరికపాడు, జయంతి రామపురం, తదితర గ్రామాల్లోని రేషన్ షాపుల పై సివిల్ సప్లయ్ అధికారులు తనిఖీలు చేపట్టారు. వైఎస్సార్ సానుభూతి పరులకు చెందిన చౌకధరల దుకాణాలపై దాడులు చేస్తున్నారని ఆరోపణలు పది రోజుల వ్యవధిలో దాడులు జరగటం మూడోసారి పల్నాడు జిల్లా పరిధిలోని డిప్యూటీ తహసీల్దార్‌లు, సీఎస్‌డీటీతోపాటు పలువురు తనిఖీల్లో పాల్గొన్నారు.

మృతదేహం అప్పగింత


రామకోటేశ్వరరావు మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ

యడ్లపాడు: స్థానిక కారుచోల రోడ్డులో ఆదివారం రాత్రి రోడ్డు ప్రమా దం జరిగిన విషయం విదితమే. ఈ ప్రమాదంలో బైక్, స్కూటీలు ఎదురెదురుగా ఢీకొనగా ముగ్గురికీ గాయాలు కాగా, వీరిలో ఒకరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కారుచోల గ్రామానికి చెందిన తాపీమేస్త్రీ నల్లజర్ల రామకోటేశ్వరరావు (36) పనివేతనం కోసం బైక్‌పై యడ్లపాడు బయలుదేరగా, అదేసమయంలో యడ్లపాడు నుంచి నూలుమిల్లు వద్దకు స్కూటీపై వస్తున్న ఒరిస్సా వాసి మిధున్ మాలిక్ దంపతులు వస్తుండగా రెండు వాహనాలు యడ్లపాడు దిగువ ఎస్సీకాలనీ శ్మశానం వద్ద ఢీకొన్నాయి. వాహనాలు దెబ్బతినడంతో పాటు ముగ్గురికీ గాయాలయ్యా యి. తలకు తీవ్రగాయమైన రామకోటేశ్వరరావును ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకున్న యడ్లపాడు ఎస్‌ఐ టి శివరామకృష్ణ మృతదేహాన్ని చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. అనంతరం గ్రామంలోనే అంత్యక్రియలు నిర్వహించుకున్నారు.

నేడు నులిపురుగుల నివారణ దినోత్సవం


డీవార్మింగ్ గోడ పత్రికలను అవిష్కరిస్తున్న ఎంపీడీవో సీతారామయ్య

శావల్యాపురం: జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం (డీవార్మింగ్) కార్యక్రమం నేడు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామపంచాయతీలు ఉండగా 1 నుంచి 19 సంవత్సరాలోపు వారందరికీ ప్రభుత్వ స్కూల్స్–45, అంగన్‌వాడీ సెంటర్లు–46 ఉండగా 4 వేల మంది పిల్లలను గుర్తించినట్లు తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రావిపూడి రమ్య మాట్లాడుతూ నులిపురుగుల ఉండటం వల్ల రక్తహీనత కడుపులో నొప్పి విరోచనాలు వాంతులు ఆయాసం తదితర లక్షణాల ఉంటాయని తద్వారా పిల్లలు ఉత్సాహాన్ని ఉల్లాసాన్ని కోల్పోవుతారన్నారు. ప్రతి ఆరు నెలలకొకసారి అల్‌బెండుజోల్ మందుబిళ్లలు మింగించటం ద్వారా పిల్లలు చురుగ్గా ఉంటారన్నారు. మధ్యాహ్నం భోజనం చేసిన అనంతరం వైద్య ఆరోగ్య సిబ్బంది పర్యవేక్షణలో అల్‌బెండ్‌జోల్ మందు బిళ్లలు మింగించాలన్నారు. అనంతరం గోడపత్రికలు అవిష్కరించారు. ఈకార్యక్రమంలో ఈవో పీఆర్‌డీ పి.సుగుణ, సూపర్‌వైజరు అలవలపూడి ఏడుకొండలు, ఉమాదేవి, సీనియర్ సహాయకులు బొడ్డుపల్లి అయ్యన్న, ఐసీడీఎస్ సూపర్‌వైజరు కుప్పం శ్రీలత, ఆరోగ్య కార్యకర్త శ్రీలలిత తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ వర్గాల ఐకాన్‌గా మోదీ నిలుస్తారు

నరసరావుపేట రూరల్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఓబీసీ వర్గాల ఐకాన్‌గా, అరాధ్య నాయకుడిగా నిలిచిపోతారని ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజ్యాంగబద్ద ప్రక్రియలో దళితుల గుండెల్లో ఆరాధ్య దైవంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నిలిచారని, అంబేద్కర్ స్ఫూర్తితో ఓబీసీ వర్గాల ఆరాధ్య నాయకుడిగా నరేంద్రమోదీ నిలిచిపోనున్నారని తెలిపారు. దేశంలో విప్లవాత్మక మార్పుల దిశగా మోదీ ప్రభుత్వం అడుగులు వేయబోతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీను, పట్టణ అధ్యక్షుడు కొల్లిపర బాలాజి, సుతారం విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

వినుకొండ: రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన వినుకొండ రూరల్ మండలం వితంరాజుపల్లి గ్రామసమీపంలో ఆదివారం రాత్రి జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వినుకొండ రూరల్ మండలం గోకనకొండ గ్రామానికి చెందిన మొగిలి ఆంజనేయులు (24) రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలలోని మార్చురీకి తరలించారు. ఆంజనేయులు మృతికి కారణాలు తెలియరాలేదు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కలహాల నేపథ్యంలో భర్త ఆత్మహత్య

యడ్లపాడు: కుటుంబ కలహాల నేపథ్యంలో భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రమైన యడ్లపాడులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...గ్రామానికి చెందిన వల్లెపు రాజేష్ (24) కోళ్ల ఫారంలో కూలీగా పని చేసేవాడు. గత కొంతకాలంగా అతని భార్య సంగీతతో మనస్పర్థలు నెలకొన్నాయి. ఈ భేదాభిప్రాయాలు పెరిగి పెద్దవి కావడంతో రాజేష్ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. దీంతో రాజు శనివారం రాత్రి క్షణికావేశంలో తన ఇంట్లో దూలానికి చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. అది గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే తలుపులు పగలగొట్టి అతడిని కిందకి దించారు. కానీ అప్పటికే రాజేష్ ప్రాణాలు కోల్పోయాడు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ టి.శివరామకృష్ణ సంఘటనా స్థలాన్ని సందర్శించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనతో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

క్లాప్ మిత్ర బలవన్మరణం

కుటుంబ కలహాల నేపథ్యంలో...


హృదయరాణి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ

యడ్లపాడు: కుటుంబ కలహాల నేపథ్యంలో క్లాప్ మిత్ర బలవన్మరణం చేసుకున్న సంఘటన సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...యడ్లపాడు దిగువ ఎస్సీ కాలనీకు చెందిన హృదయరాణి (35) వివాహం తర్వాత దంపతులు ఇద్దరు పిల్లలతో కలిసి స్వగ్రామమైన యడ్లపాడులోనే నివాసం ఉంటుంది. కొద్దికాలంగా దంపతుల మధ్య ఏర్పడిన మనస్పర్థల కారణంగా వేర్వేరుగా ఉంటున్నారు. 2018 నుంచి యడ్లపాడు పంచాయతీ కార్యాలయం పరిధిలో క్లాప్‌మిత్రగా విధులు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటుంది. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్‌కు చీరెతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమెకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. హృదయరాణి ఆత్మహత్యకు గల కారణాలపై ఇంకా స్పష్టత రాలేదు. సమాచారం అందుకున్న వెంటనే యడ్లపాడు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనతో ఆమె కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

గ్రంథాలయ పునర్ నిర్మాణం అభినందనీయం

చిలకలూరిపేట: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, అలాంటి గ్రంథాలయాన్ని స్వంత నిధులతో అభివృద్ధి చేసుకోవడం అభినందనీయమని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. పట్టణంలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ గ్రంథాలయాన్ని రూ. 16 లక్షలతో పునఃనిర్మాణం చేయగా, సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 90 ఏళ్ల నాడు ప్రజలకు విజ్ఞానం పెంచేలా నిర్మించిన గ్రంథాలయాన్ని వాసవీ కన్యకాపరమేశ్వరీ ధర్మసంఘం సభ్యులు పునః నిర్మాణం చేయడం ఆదర్శనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో చైతన్యం నింపేందుకు ఎంతగానో దోహదపడతాయన్నారు. ముందుగా గ్రంథాలయ భవనంలో ఏర్పాటు చేసిన మహాత్మగాంధీ విగ్రహానికి నివాళులు అర్పించి, గ్రంథాలయాన్ని పునః ప్రారంభించారు. కార్యక్రమంలో ధర్మ సంఘం గౌరవ అధ్యక్షుడు గుర్రం సాంబశివరావు, అధ్యక్షుడు పసుమర్తి వెంకట సూర్య ప్రకాశరావు, కార్యదర్శి చేబ్రోలు శ్రీనివాసరావు, కోశాధికారి రాచుమల్లు నాగేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

● రహదారంతా అధ్వానం



గణపవరం–చిలకలూరిపేట డొంక రోడ్డు అధ్వానంగా మారింది. ఆదిపరాశక్తి ఆలయం సమీపంలో కల్వర్టు వద్ద గొయ్యి ఏర్పడి వాహనదారులకు ప్రమాదభరితంగా మారింది. అటుగా వెళ్తున్న పలువురు వాహనదారులు ప్రమాదానికి గురయ్యారు. దీంతో కొందరు గొయ్యి వద్ద రాళ్లు, కర్ర పుల్లలు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. ద్విచక్రవాహనాలు, ఆటోలు మినహా భారీ వాహనాలు అటుగా వెళ్లాలంటే రోడ్డు కుంగి ప్రమాదం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆరు నెలల క్రితం రోడ్డు మరమ్మతులు నిర్వహించారు. అయినప్పటికీ వర్షం కురిస్తే రోడ్డు బురదమయంగా మారి మార్జిన్లు కుంగి ప్రమాదభరితంగా మారాయి. పంచాయతీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

–నాదెండ్ల

అండర్ -14 బ్యాడ్మింటన్‌కు ఎంపికైన గుడ్ షఫర్డ్ విద్యార్థి



వినుకొండ: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నేషనల్ కోచింగ్ సెంటర్, యానంలో నిర్వహించిన అండర్–14 బ్యాడ్మింటన్ సెలక్షన్‌లో పట్టణంలోని గుడ్‌షపర్డ్ పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి కోట కమల్‌కుమార్ ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గోపు ఇన్నారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోపు బాలిరెడ్డి ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ శిక్షణ తీసుకుంటూ నేషనల్ స్థాయికి ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. కమల్ కోచింగ్ నిమిత్తం యానం వెళ్తున్నాడని, ఇక అక్కడే ఐదు సంవత్సరాలు ఉచితంగా విద్యతో పాటు, ఉచిత బ్యాడ్మింటన్ కోచింగ్ ఇస్తూ నేషనల్, ఇంటర్నేషనల్ స్థాయిలో ఆడేందుకు శిక్షణ ఇస్తారని తెలిపారు. అనంతరం విద్యార్థిని పలువురు అభినందించారు.

క్రీడా దినోత్సవ పోటీలకు మున్సిపల్ విద్యార్థులు



నరసరావుపేట ఈస్ట్: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని సత్తెనపల్లి రోడ్డులోని డీఎస్‌ఏ స్టేడియంలో నిర్వహించిన అథ్లెటిక్స్, క్రీడా పోటీలలో బరంపేటలోని కాసు బ్రహ్మానందరెడ్డి మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు పాల్గొని జిల్లా జట్టుకు ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.తావుర్యా సోమవారం తెలిపారు. తమ విద్యార్థులు వాలీబాల్ మహిళా విభాగానికి పి.ప్రణతి, షేక్.షహనాజ్, పి.జాహ్నవి, వై.స్తోత్రాంజలి, ఎస్.త్రివేణి, కబడ్డీలో షేక్.అయేషా, బాట్మింటన్ పురుషుల విభాగంలో డి.వేదసాయి కార్తీక్ ఎంపికైనట్టు వివరించారు. ఈనెల 19, 20 తేదీలలో ఏఎన్‌యూ క్రీడా మైదానంలో నిర్వహించనున్న జోన్ 3 స్థాయి పోటీలలో తమ విద్యార్థులు పల్నాడు జిల్లాకు ప్రాతినిథ్యం వహిస్తారని తెలిపారు. విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయులు జి.ఇజ్రాయేల్ ప్రసాదు, డి.గంగమ్మ అభినందించారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలో ఢిల్లీ స్కూల్ ద్వితీయ స్థానం



నరసరావుపేట ఈస్ట్: రాష్ట్రస్థాయి చదరంగం పోటీల్లో ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించినట్టు పాఠశాల చైర్మన్ డాక్టర్ నాగోతు ప్రకాష్‌రావు సోమవారం తెలిపారు. అమరావతిలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఈనెల 10వ తేదీన నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ స్టేట్ ర్యాంకింగ్ ఓపెన్, గర్ల్స్ చెస్ టోర్నమెంట్–2025 పోటీలో తమ పాఠశాల విద్యార్థులు ఏకాగ్రత, వ్యూహం, పట్టుదలతో ప్రతిభను చాటుకున్నారని తెలిపారు. విద్యార్థులు కృషి, క్రమశిక్షణతో విద్యా, క్రీడా రంగాలలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ నాగోతు సబితా, ప్రిన్సిపల్ రేఖా పూలేకర్, ఉపాధ్యాయులు అభినందించారు.

నందమూరి క్రిష్టర్‌కు సన్మానం

చిలకలూరిపేట: స్థానిక చిలకలూరిపేట పట్టణానికి చెందిన నందమూరి క్రిష్టర్ జాతీయ స్థాయిలో గొప్ప గౌరవాన్ని అందుకున్నారు. ఆల్ ఇండియా బిషప్స్ అండ్ పాస్టర్స్ ఫెలోషిప్‌లో ఆయన నేషనల్ జాయింట్ సెక్రటరీగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం జీసస్ ప్రేయర్ ఫెలోషిప్ కమిటీ సభ్యులు చిలకలూరిపేటలోని శాంతి నిలయంలో ఆయనను ఘనంగా సన్మానించారు. జిల్లా స్థాయి నుండి జాతీయ స్థాయి వరకు క్రైస్తవుల సమస్యల పక్షాన నిలబడటానికి దేవుడు ఇచ్చిన ఈ అవకాశాన్ని క్రిష్టర్‌కు గొప్ప వరంగా వారు అభివర్ణించారు. క్రైస్తవ సేవకుల మధ్య ఐక్యతను తీసుకురాగల వ్యక్తిగా ఆయనను ప్రశంసించారు. కార్యక్రమానికి జేపీఎఫ్ అధ్యక్షుడు పాల్‌రాజు, వైస్‌ప్రెసిడెంట్ తిమోతి, పాస్టర్లు శాంతిసాగర్, మధు, బుజ్జి, దేవునిదయ, పాల్ సారధి తదితరులు హాజరయ్యారు. సన్మానానికి హాజరైన వారందరికీ నందమూరి క్రిష్టర్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో జేపీఎఫ్ అవసరాలకు సంపూర్ణ మద్దతు అందిస్తానని హామీ ఇచ్చారు. ప్రపంచ ప్రార్థన బృందం నుండి ఎంఎస్ మూర్తి (సూరిబాబు) ప్రత్యేక అభినందనలు తెలిపారు.

క్లుప్తంగా

13న ట్రంప్, మోదీల రైతు వ్యతిరేక విధానాలకు నిరసన



వినుకొండ: సంయుక్త రైతు సంఘాల సమన్వయక సమితి పిలుపులో భాగంగా ఈ నెల 13వ తేదీన జిల్లాలోని అన్ని మండలాల్లో ట్రంప్, మోదీల రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా వారి దిష్టిబొమ్మలు దగ్ధం చేయాలని పల్నాడు జిల్లా రైతు సంఘం కార్యదర్శి ఉలవలపూడి రాము కోరారు. స్థానిక శివయ్యభవన్‌లో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ట్రంప్ మన దేశంపైన విధించిన 50 శాతం సుంకాలను వెనక్కి తీసుకోవాలని, మోదీ వెంటనే డాక్టర్ స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయాలని, రైతులకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చాలని, వ్యవసాయ వ్యతిరేక మూడు నల్ల చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు నాయకులు బాలస్వామి, వెంకటేశ్వర్లు, వెంకటరత్నం, రామయ్య, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాలు రైతులకు అండగా నిలవాలి

చిలకలూరిపేట: ప్రాథమిక సహకార సంఘాలు అన్ని వేళలా రైతులకు అండగా నిలవాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. చిలకలూరిపేట మండలం మురికిపూడి పీఏసీఎస్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం సోమవారం నిర్వహించారు. సంఘ చైర్మన్‌గా చిగురుపాటి రాజబాబు, డైరెక్టర్లుగా తమ్మిశెట్టి నాగేశ్వరరావు, గుత్తికొండ సాంబశివరావు ప్రమాణం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నెల్లూరి సదాశివరావు, బీజేపీ నియోజకవర్గ సమన్వయకర్త టి జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జోన్- 3 పోటీలకు వాగ్దేవి విద్యార్థులు



నరసరావుపేట ఈస్ట్: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని సత్తెనపల్లిరోడ్డులోని డీఎస్‌ఏ స్టేడియంలో నిర్వహించిన అథ్లెటిక్స్, క్రీడా పోటీలలో వాగ్దేవి జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొని పల్నాడు జిల్లా జట్టుకు ఎంపికై నట్టు కళాశాల కార్యదర్శి రాయల శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ ఓగూరి నాగేశ్వరరావు సోమవారం తెలిపారు. అథ్లెటిక్స్‌లో బాలికలు 16, బాలురు 6, ఖోఖో బాలికలు 3, బాలురు 3, కబడ్డీలో బాలికలు 3, బాలురు 2, వాలీబాల్ బాలుర విభాగంలో ఒకరు ఎంపికై నట్టు వివరించారు. ఎంపికై న విద్యార్థులు ఈనెల 19, 20 తేదీలలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం క్రీడా మైదానంలో 7 జిల్లాల క్రీడాకారులు పాల్గొనే జోన్- 3 పోటీలలో పల్నాడుజిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. విద్యార్థులను కళాశాల డైరెక్టర్లు కాట్ల రామకోటేశ్వరరావు, కపలవాయి రాజేంద్రప్రసాదు, పాశం కృష్ణారావు, పి.వి.అచ్యుతరావు, పిడి రాయల ఆంజనేయులు అభినందించారు.

హైస్కూలుకు ఆటో వితరణ



నాదెండ్ల: సంకురాత్రిపాడు గ్రామానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు తోట వెంకట సుబ్బయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారుడు తోట శ్రీరాములు రూ1 లక్ష విలువైన ఆటోను పాఠశాలకు విరాళంగా అందించారు. మాజీ మండల ఉపాధ్యక్షుడిగా పనిచేసిన తోట శ్రీరాములు సంకురాత్రిపాడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి. యడ్లపాడు మండలం చెంఘీజ్‌ఖాన్‌పేట, సంతపేట గ్రామాలకు చెందిన కొందరు విద్యార్థులు నిత్యం కాలినడకన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వస్తున్నారు. విషయాన్ని గమనించిన తోట శ్రీరాములు విద్యార్థుల సౌకర్యార్థం ఆటోను ఉన్నత పాఠశాలకు అందించారు. ఈ సందర్భంగా ఆయన్ను ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

మాల మహానాడు ప్రధాన కార్యదర్శిగా కనపర్తి



గుంటూరు రూరల్: మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మండలంలోని బుడంపాడు గ్రామానికి చెందిన కనపర్తి లలిత్‌బాబును నియమించినట్లు మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ళ అరుకుమార్ తెలిపారు. సోమవారం నగరంలోని మాల మహానాడు కార్యాలయంలో నియామక పత్రాలను అందించి జాతీయ అధ్యక్షుడు మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడు గోదా జాన్‌పాల్ ఆధ్వర్యంలో లలిత్‌బాబుకు నియామక పత్రాన్ని అందజేయటం జరిగిందన్నారు. సంఘం అభివృద్ధికి, కృషిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని సూచించారు.